క్లుప్తంగా

వాసుదేవరావుకు అభినందన



వాసుదేవరావును అభినందిస్తున్న ములగాడ మండల విద్యాశాఖ అధికారులు

మల్కాపురం: నిరుపేద విద్యార్థుల చదువుకు సాయం అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వాసుదేవరావుకు డాక్టరేట్ ఇవ్వడం అభినందనీయమని ములగాల ఎంఈవోలు త్రినాథ్‌రావు, వెంకటేశ్వరరావు అన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద లక్కీ అమర్ పాఠశాల నిర్వహిస్తున్న వాసుదేవరావు సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. డాక్టర్‌రేట్ అందుకున్న ఆయన్ని శనివారం ఎంఈవోలు సత్కరించారు.

భద్రతకు తొలి ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మల్కాపురం: భద్రతా ప్రమాణాలు పాటించి పని చేసినప్పుడే ప్రగతి సాధ్యమవుతందని ఫ్యాక్టరీస్ శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ అన్నారు. కోరమాండల్ సంస్థ, ఫ్యాక్టరీస్ శాఖ సంయుక్తంగా శనివారం సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనంలో భద్రతపై సదస్సు నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞాన సుందరం, సంస్థ హెచ్‌ఆర్ హెడ్ రెడ్డిపల్లి శ్రీనివాసరావు విధులు నిర్వహిస్తున్న కార్మికుల కోసం తీసుకుంటున్న భద్రతా చర్యలను వివరించారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదానం శిబిరం

మల్కాపురం: రిపబ్లిక్ డే సందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్,పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి డాక్టర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో గుల్లలపాలెం వాకర్స్ పార్కు సమీపంలో ఆదివారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీపశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి తదితర ప్రముఖులు ప్రారంభించనున్నారు. గతేడాది నిర్వహించిన మెగా రక్తదానం శిబిరం ద్వారా పి.వి.సురేష్ రికార్డు సృష్టించారు. ఈ సారి కూడా అదే స్థాయిలో శిబిరం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

లావణ్యకు టీటీడీ ఉద్యోగుల సత్కారం



లావణ్యను సత్కరిస్తున్న టీటీడీ ఉద్యోగులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధికి చెందిన నూనెల లావణ్యయాదవ్‌ను టీటీడీ ఉద్యోగులు సత్కరించారు. లావణ్య పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, కోలాటంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆ చిన్నారులచే పలు ఆలయాల్లో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. ఇది గుర్తించి నగరంలోని టీటీడీ కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగులు లావణ్యను సన్మానించారు.

నిర్మాణం పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు నక్కవానిపాలెం కొండ ప్రాంతంలో చేపడుతున్న నిర్మాణంపై ములగాడ తహసీల్దార్ భుజంగరావు ఆరా తీశారు. ఆర్‌ఐ దివ్య,సిబ్బందితో కలిసి శనివారం కొండ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు.అయితే వారికి ఇచ్చిన పట్టా హద్దుల్లో నిర్మాణం జరుపుతున్నారని అధికారులు వివరించారు. ఆరోపణలు అవాస్తవం అని వెల్లడించారు.

మాస్టర్ ప్లాన్ ఉన్నా..

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నేషనల్ హైవే నుంచి పాసుపోర్టు కార్యాలయం పక్కగా బీఆర్టీఎస్ రోడ్డుకు అనుసంధానంగా ప్రస్తుతం ఉన్న రహదారిని 60 అడుగల మేర విస్తరించాలని జీవీఎంసీ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు.



అభివృద్ధిపైనా పాలిటిక్స్

పాసుపోర్టు కార్యాలయం పక్క నుంచిహైవే-బీఆర్టీఎస్(కంచరపాలెం-గోపాలపట్నం) రోడ్డుకు ప్రస్తుతం కొన్ని చోట్ల 20 అడుగులు, కొంతమేర 30 అడుగుల రహదారి ఉంది. ఈ రహదారి సుమారు 2.26 కిలోమీటర్లు ఉంటుంది. దీనికి ఒకవైపు నివాస గృహాలు, మరో వైపు ఎయిర్‌పోర్టు అథారిటీకి చెందిన స్థలం ఉంది. ఇళ్లను తొలగించాల్సిన అవసరం లేకుండానే ఖాళీగా ఉన్న ఎయిర్ పోర్టు అథారిటీ స్థలం తీసుకొని రహదారి విస్తరించవచ్చు.కానీ రహదారి విస్తరణపై కూటమి నేతలు పాలిటిక్స్ చేస్తున్నారు. 60 అడుగులు మేర విస్తరిస్తే భారీ వాహనాల రాకపోకలతో అసౌకర్యం కలుగుతుందని చుట్టుపక్కల ఇళ్ల వారిని ప్రేరేపించి అడ్డుపుల్ల వేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ఇదీ పరిస్థితి

మోక్షమెప్పుడో..!

ఆ ప్రాంత వాసుల కల నెరవేరేలా లేదు. మూడు దశాబ్దాలుగా వానుతున్న సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల బూజు వదిలించింది.రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న ఎయిర్‌పోర్టు స్థలం తీసుకుని ప్రత్యామ్నాయంగా భోగాపురం ఎయిర్‌పోర్టు వద్ద ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర, ప్రత్యుత్తరాలు జరిగాయి. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన ఊసే లేదు. దీంతో తమ కల నెరవేరానా అని ఆ ప్రాంత వాసులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.64 కోట్ల కేటాయింపు

భవిష్యత్ అవసరాల దృష్ట్యా రహదారి విస్తరణ అనివార్యమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చేసిన ప్రతిపాదనలకు తాజాగా జీవీఎంసీ కౌన్సిల్ కూడా సానుకూలంగా స్పందించింది.ఈ దారిని సుందరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రూ.4 కోట్లతో పనులు చేపట్టాలని ప్రతిపాదనలు చేయగా.. రూ.1.64 కోట్లు కేటాయిస్తూ నగర పాలక సంస్థ కౌన్సిల్ ఆమోదించింది.



విస్తరించాల్సిన రోడ్డు

- రూ.1.64 కోట్లు కేటాయింపు
- ఎయిర్‌పోర్టు స్థల సేకరణపై శ్రద్ధ కరువు
- పట్టించుకోని కూటమి పెద్దలు
- నిరాశ వ్యక్తం చేస్తున్న ప్రజలు

విశాఖ విద్య: హైవే నుంచి (పాస్‌పోర్టు కార్యాలయం పక్క నుంచి) మర్రిపాలెం నేతాజీనగర్ మీదుగా బీఆర్టీఎస్(కంచరపాలెం వైపు)కు అనుసంధానం చేస్తూ 60 అడుగుల మేర రహదారి విస్తరించాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జీవీఎంసీ మాస్టర్ ప్లాన్‌లో ఉన్నప్పటికీ ఎయిర్ పోర్టు అథారిటీ నుంచి స్థల సేకరణ సమస్యతో రహదారి విస్తరణకు నోచుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్పట్లో అధికారులు దీనికి సంబంధించిన ఫైళ్ల బూజు దులిపారు. రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి జీవీఎంసీ తీసుకొని.. ప్రత్యామ్నాయంగా భోగాపురం వద్ద ఎయిర్‌పోర్టు అథారిటీకి స్థలం కేటాయించేలా ఆలోచనలు చేశారు. ఈ మేరకు ఎయిర్ పోర్టు డైరక్టర్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ సైతం రాశారు. ఇంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇది మరుగునపడింది.

రహదారి పూర్తయితే ఎన్నో ప్రయోజనాలు

బిర్లా జంక్షన్ నుంచి హైవేలో వచ్చే వాహనాలు మర్రిపాలెం రైల్వే స్టేషన్, కంచరపాలెంవైపు ఎన్ఏడీ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాలి. పాసుపోర్టు ఆఫీసు పక్క నుంచి బీఆర్టీఎస్ రహదారికి కనెక్టివిటీగా 60 అడుగులు రోడ్డు విస్తరిస్తే ఫ్లై ఓవర్ వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగుతాయి. రహదారికి ఇరువైపులా ఉన్న పదుల సంఖ్యలో కాలనీ వాసులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం



పాసుపోర్టు కార్యాలయం పక్క నుంచి 60 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. మాస్టర్ ప్లాన్‌లో భాగమే ఇది. ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులు దీనిపై సమ్మతిస్తారనే నమ్మకం ఉంది. రహదారి అభివృద్ధికి రూ.1.64 కోట్లు నిధులు కేటాయిస్తూ, జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లభించింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

విస్తరణ అవసరం



ఎన్ఏడీ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. 60 అడుగుల రోడ్డు విస్తరించాలని ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కూటమి పెద్దలు కూడా సహకరించాలి. రహదారి విస్తరిస్తే ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

– బీఎస్.కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

అభివృద్ధి పనుల్లో రాజకీయాలు తగవు



పాస్ పోర్టు కార్యాలయం రహదారిని 60 అడుగుల మేర విస్తరించాలని ఎన్నో సంవత్సరాల నుంచి కోరుతున్నాం. కానీ ఎవరూ దీనిపై పట్టించుకోలేదు. ఇన్నాళ్లకైనా సమస్యకు పరిష్కారం లభిస్తోందని ఆనందపడుతున్నాం. ఏ ప్రభుత్వం అయినా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపట్టాలి. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావివ్వకూడదు.

– సురేష్, మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ అసోసియేషన్ కార్యదర్శి

సచివాలయ పరిసరాలు పరిశుభ్రం



శుభ్రం చేసిన తర్వాత ఆహ్లాదకరంగా సచివాలయ భవనం పరిసరాలు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి తుమ్మడపాలెం భవానీగార్డెన్స్ సచివాలయం, సులభ్‌కాంప్లెక్స్, శ్మశానవాటిక పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో స్థానికులు, సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడేవారు. మందుబాబులు సచివాలయ భవనంపై రాత్రిపూట చిందులు వేయడం, వీధి లైట్లు ఆర్పేసి హంగామా సృష్టించేవారు. దీంతో చీకటి పడితే అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడేవారు. సమస్యపై ఈ నెల 24న 'సాక్షి' దినపత్రికలో 'అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా' అనే కథనం వెలువడింది. దీంతో జోన్-5 అధికారులు స్పందించారు. పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ ఆదేశాల మేరకు జోన్ సూపర్‌వైజర్ జనార్ధనరావు పర్యవేక్షణలో శనివారం సచివాలయం, సులభ్‌కాంప్లెక్స్ పరిసరాలను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

డీఐసీ జీఎం ఆదిశేషు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐసీ జీఎం ఆదిశేషు

అక్కిరెడ్డిపాలెం: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ఎంతో తోడ్పాటు అందిస్తుందని డీఐసీ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు అన్నారు. ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో ఆటోనగర్ డి – బ్లాక్‌లో భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ అధికారులు శనివారం వాసీవా భవనంలో లబ్ధిదారులకు విశ్వకర్మ పథకంలో భాగంగా వాషర్ మ్యాన్, బోట్ మేకర్ ట్రేడ్‌లతో పాటు పలు సాంప్రదాయక పథకాలపై అవగాహన కార్యక్రమంతో పాటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ విశ్వకర్మ పథకంలో ప్రవేశపెట్టిన 18 రకాల్లో వారికి వర్తించే పథకాన్ని ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వారికి జిల్లా పరిశ్రమల కార్యాలయం ద్వారా వర్తించే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ జంగం చంద్రమౌళి పథకాల వివరాలు, పథకాలకు ఎవరు అర్హులు, దరఖాస్తు విధానంతో పాటు విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో 68 మంది మహిళలు, 18 మంది పురుషులు పాల్గొన్నారు. సీఎస్‌సీ జిల్లా మేనేజర్ అల్లు జగదీష్, సీఎస్‌సీ ఆపరేటర్ రాజు దరఖాస్తులు నమోదు చేశారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, జీవీఎంసీ ఏపీడీ పి.దుర్గా ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, ఎంఎస్‌ఎంఈ ఏడీలు అపర్ణ, మహావీర్, సిబ్బంది సుబ్బారావు, సతీష్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా



స్టీల్‌ప్లాంట్ సీజీఎం మొహంతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జీతాల అంశంపై యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, విశ్రాంత ఉద్యోగుల మెడికల్ స్కీమ్‌లో మార్పులు ఉపసంహరించి పాత పద్ధతి కొనసాగించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు రెండున్నర నెలల జీతం పెండింగ్‌లో పెట్టడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారనన్నారు.ఉద్యోగుల జీతాల నుంచి మీల్ కార్డు నగదు ఉపసహరించి వాటిని మీల్ కార్డుకు పంపకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి, హెచ్‌ఆర్ జీఎం ఎన్ భానులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, రమణమూర్తి, రాజు, కారు రమణ, జీవీ సుబ్బయ్య, కొమ్ము ప్రసాద్, ఎన్. రమేష్‌కుమార్, ఎస్.ఎ. నాయుడు, మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

6 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను శనివారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు, సిబ్బంది విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ సాహిల్, మోట నవీన్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా 6 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినటు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గల్లా చిన్నా

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, జై ఆంధ్రాకాలనీ ప్రాంతాల్లో సుమారు రూ.2 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న రక్షణ గోడలు, కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులకు శనివారం కార్పొరేటర్ గల్లా చిన్నా శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, బాబూరావు,ధర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



శ్రీరామ్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, జెడ్సీ హేమావతి

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో శనివారం ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే గోపాలపట్నం రైతు బజారులో పర్యటించారు.బజారులో కాల్వలు పాడయ్యాయని వాటిని బాగు చేయాలని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామ్‌నగర్‌లో గెడ్డలు పూడికలతో నిండిపోయి ఉన్నాయని వాటిన శుభ్రం చేయించాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ పూడికలు తీయించాలని జోన్ కమిషనర్ హేమావతికి సూచించారు. సమస్యల పరిష్కారానికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట నారిపిన్ని సత్తిరాజు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ఎన్ఏడీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

- విశాఖ ఆర్డీవో శ్రీలేఖ
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఎన్ఏడీలో భారీ అవగాహన ర్యాలీ

విశాఖ విద్య: ప్రజా స్వామ్యయంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని విశాఖ ఆర్డీవో శ్రీలేఖ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం నుంచి బీఆర్టీఎస్ రోడ్ మీదుగా ఎన్ఏడీ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. విశాఖ ఆర్డీవో శ్రీలేఖ, గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ ప్రసాద్, జీవీఎంసీ జోన్-8 కమిషనర్ హైమావతి, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, గోపాలపట్నం, ములగాడ డిప్యూటీ తహసీల్దార్లు సువర్ణబాయి, రమాతో పాటు రెవెన్యూ సిబ్బంది, యువ ఓటర్లు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీలేఖ మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి యువతీ యువకులంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ద్వారా సమర్థ వంతమైన నాయకులను ఎన్నుకోవచ్చునన్నారు. ఫారం-6ఏ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.



గుల్లలపాలెం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

మల్కాపురం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా 58వ వార్డు గుల్లలపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామస్తులు, నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

- మల్కాపురం ప్రాథమిక పాఠశాల వద్ద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.
- ఇండస్ట్రియల్‌కాలనీ జీవీఎంసీ పాఠశాల వద్ద జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సందడిగా కేంద్రీయ విద్యాలయం స్పోర్ట్స్ డే

ఉక్కునగరం: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో శనివారం క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 39వ వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల క్రీడా మైదానంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఈ.వి.ఎల్.ఎన్. వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ సందర్భంగా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో విద్యార్థులు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



ప్రిన్సిపాల్ నారాయణరావు, అధ్యాపకులతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో స్థానిక విద్యార్థులు ప్రతిభ చూపి అత్యధికంగా ఉద్యోగాలు సాధించారు. చెన్నైకు చెందిన సెయింట్ గోబైన్ గ్లాస్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ కాలేజీలో తృతీయ సంవత్సరం చదువుతున్న 47 మంది విద్యార్థులు రాత పరీక్ష, మౌఖిక పరీక్షల అనంతరం ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో 26 మంది, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 13 మంది, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 8 మందిని ఆ కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి కంపెనీ ప్రతినిధుల సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణ రావు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.రత్నకుమార్, స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, ఇతర విభాగాధిపతులు, విభాగాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు జూన్ నెలలో చెన్నైలోని సెయింట్ గోబైన్ పరిశ్రమలో శిక్షణ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు.